## సెల్ఫ్ గణన సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/చార్మినార్:** జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ద్వారా ప్రజలు తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ జెడ్‌సి సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం జెడ్‌సి కార్యాలయంలో ఆయన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో భాగంగా తన వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం జోనల్ ఉద్యోగులకు ప్రక్రియను ప్రారంభించారు.

## ప్రభుత్వ స్థలంలో దుకాణం?




**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ఓ పక్కన ప్రభుత్వ పాఠశాల.. మరోపక్కన ప్రభుత్వ ఆసుపత్రి.. మధ్యన మాత్రం ప్రైవేట్ కట్టడం? ఇదేమిటని స్థానికులు వాపోతున్నారు. చాంద్రాయణగుట్ట నుంచి కందికల్ రోడ్డు ప్రధాన రహదారిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల.. ప్రభుత్వ ఆసుపత్రి మధ్యన ఉండాల్సిన పబ్లిక్ టాయిలెట్స్ ఎలా మాయమయ్యాయి? దుకాణం ఎలా ఏర్పాటయ్యింది? అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజకీయ పలుకుబడితో మూత్రశాలను తొలగించి షాపుగా మార్చి మెకానిక్ పనులు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నా... ఈ వ్యవహారం గడచిన 16 ఏండ్లుగా సాగుతున్నా.. బల్దియా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా కబ్జాను తొలగించి ప్రభుత్వం స్థలం స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉస్మానియాలో కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్/అబిడ్స్:** మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఉస్మానియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ సిబ్బంది నిరసన తెలిపారు. గత మూడు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు చెల్లించాలని సివిల్ సర్జన్ ఆరంబో జై కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సదురు కాంట్రాక్టర్‌తో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో జీతాలు వచ్చేలా చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఉద్యోగులు విధులకు హాజరయ్యారు.

## బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** బిఆర్‌ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రహమత్‌నగర్‌లో సోమవారం ఘనంగా జరిగాయి. పార్టీ సీనియర్ నాయకులు కమటం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా టిఎస్‌ఇడబ్ల్యుఐడిసి మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి హాజరై పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సురేందర్ కంకట, రాకేష్ క్రిస్టఫర్, చాపల కృష్ణ, కమటం లలితారెడ్డి, సోని శ్రీశైలంయాదవ్, మల్లేష్ పల్లపు, అబ్దుల్‌గన్ని, గడ్డం శ్రీధర్, ఫ్రాంక్లిన్, పాల్, విజయ్ కిరణ్, అశోక్, లక్మయ్య, బబ్లూ, అల్తాఫ్, కిరణ్ యాదవ్, కురుమూర్తి, శ్రీనివాస్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా... జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో బిఆర్‌ఎస్ ఇంచార్జి మాగంటి సునీత గులాబీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.

## యువతలో అవగాహన పెరుగుతోంది



**ప్రజాపక్షం/మలక్‌పేట్:** హిందూ ధర్మం, సంస్కృతి ఎంతో గొప్పవని అఖిల భారత సామాజిక సమరసత కళా విభాగం కన్వీనర్ అప్పల ప్రసాద్ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపనకు వందేళ్లు పూర్తైన సందర్భంగా అస్మాన్‌ఘడ్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లో హిందూ సమ్మేళన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ ధర్మచార్య పీఠం కమలేష్ దాస్ జి మహారాజ్, శాస్త్రవేత్త ఏ.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భారతదేశ సనాతన ధర్మం విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. హిందూ సమ్మేళనాల ద్వారా యువతలో ధర్మంపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. భారతదేశం గొప్ప నాగరికత కలిగిన దేశమని, కుటుంబ వ్యవస్థ, త్యాగం, సేవ వంటి విలువలు మన సంస్కృతిలో ప్రధానమని తెలిపారు.

## జలమండలి కార్యాలయ ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** వేసవి నేపథ్యంలో నెలకొన్న మంచినీటి సమస్యలను పరిష్కరించడంతో జలమండలి విఫలమయ్యిందని బిజెపి ఆరోపించింది. ఈ మేరకు జలమండలి ప్రధాన కార్యాలయం వద్ద బిజెపి గోల్కొండ జిల్లా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు ఉమా మహేంద్ర,శంకర్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ... మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని.. అయినా జలమండలి తగిన ప్రణాళిక రూపొందించకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. బస్తీలు, కాలనీల్లో ఎక్కడ చూసినా మురుగు సమస్య ఉన్నందని.. వెంటనే జలమండలి ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## పోలీసు శాఖలో మహిళల భద్రతకు
# ‘బాల పంచాయత్’




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, బాలల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ‘బాల పంచాయత్’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ వారాంత ప్రచారాన్ని సోమవారం లక్డికాపూల్‌లోని తన కార్యాలయంలో మహిళా భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ చారుసిన్హా ప్రారంభించారు. ఈ మేరకు ప్రచార పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చారుసిన్హా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో బాలల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, కమ్యూనిటీ భద్రతను మెరుగుపరచడం, సమగ్ర పాలనను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బాలల కోసం ప్రత్యేక వేదికగా రూపొందించిన ఈ పంచాయత్ ద్వారా వారు తమ సమస్యలను చర్చించుకోవడం, పరిష్కారాలు సూచించడం, గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం సాధ్యమవుతుందన్నారు. దీని ద్వారా బాలల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని చారుసిన్హా తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 27 నుంచి మే 2 వరకు నాలుగు జిల్లాల్లోని ఆరు గ్రామాల్లో అమలు కానుందని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో తీగరాజుపల్లి, ఉప్పరపల్లి, మెద్చల్ జిల్లాలో అన్నోజిగూడ, వికారాబాద్ జిల్లాలో నవాబ్‌పేట్, మదనపలి, మెదక్ జిల్లాలో శిక్లందాపూర్ ప్రతి ఎంపిక చేసిన గ్రామంలో బాల పంచాయత్ ఏర్పాటు చేసి, బాలలు తరచుగా సమావేశమై స్థానిక సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషిస్తారని తెలిపారు. గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో బాల సభ్యులను ఎంపిక చేస్తారు. అమ్మాయిలు, అబ్బాయిలకు సమాన ప్రాధాన్యం కల్పించడంతో పాటు వివిధ వర్గాల ప్రాతినిధ్యం ఉండేలా చూస్తారని తెలిపారు. ప్రతి బాలుడు సురక్షితంగా, సంతోషంగా, గౌరవంతో జీవించే గ్రామాల నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, పెద్దలతో కలిసి నిర్ణయాల ప్రక్రియలో బాలల భాగస్వామ్యాన్ని పెంచి, మరింత భద్రతతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు ఈ కార్యక్రమం దోహదం చేయనుందన్నారు.

## రైల్వే ఉద్యోగులకు భద్రతా అవార్డులు



### వేసవిలో భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: జిఎం సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) భద్రత పట్ల తన అంకితభావాన్ని పునరుద్ఘాటిస్తూ 13 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ది మంత్ భద్రతా అవార్డులను ప్రదానం చేసింది. రైల్ నిలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ పురస్కారాలను అందజేశారు. సికింద్రాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లకు చెందిన ట్రాక్ మెయింటైనర్లు, లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు తదితర క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ, ఉద్యోగుల అంకితభావం ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. వేసవి కాలంలో ట్రాక్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

## ఆస్తమా ఇంకా ఆరోగ్య సమస్యగానే ఉంది: డాక్టర్ జిఎస్‌రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తీవ్రమైన ఆస్తమా ఇంకా ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగానే కొనసాగుతోందని యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ రావు అన్నారు. హైటెక్ సిటీలో సోమవారం యశోద హాస్పిటల్స్, అకాడమీ ఫర్ అడ్వాన్స్‌డ్ పల్మనరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సహకారంతో సీవియర్ ఆస్తమా ప్రీసెప్టర్షిప్ ప్రోగ్రామ్ , లైవ్ వర్క్ షాప్ సదస్సును నిర్వహించారు. దేశవ్యాప్తంగా 400కు పైగా డెలిగేట్స్, పల్మనాలజిస్టులు, మెడికల్ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తీవ్రమైన ఆస్తమా నిర్ధారణ, నిర్వహణ వైద్య విధానాలపై ప్రిసిషన్ మెడిసిన్ విధానాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ రావు మాట్లాడుతూ అధునాతన చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ సరైన గుర్తింపు లేకపోవడం, ఫీనోటైపింగ్ మరియు అత్య ఆధునిక చికిత్సా విధానాల అవగాహన లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రాక్టికల్, కేస్‌బేస్డ్ లర్నింగ్ తో కూడిన ఈ ప్రీసెప్టర్షిప్ ద్వారా ప్రత్యేక వైద్య విద్యను ప్రోత్సహించి, ప్రెసిషన్ రెస్పిరేటరీ కేర్ ద్వారా రోగుల వైద్య ఫలితాలను మెరుగుపరచాలనే మా ముఖ్య ఉద్దేశం అని డాక్టర్ జి ఎస్ రావు తెలియజేసారు. డాక్టర్ వి.నాగార్జున మాటూరు మాట్లాడుతూ తీవ్రమైన ఆస్తమా నిర్వహణలో ఫీనోటైపింగ్, బయోమార్కర్స్ మరియు బయోలాజిక్ థెరపీలు ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తున్నామని ఈ ప్రీసెప్టర్షిప్ ద్వారా వైద్యులకు ప్రాక్టికల్, కేస్‌బేస్డ్ అనుభవం అందించి, వ్యక్తిగతీకరించిన చికిత్సా విధానాలను అమలు చేసే సామర్థ్యాన్ని పెంపొందించడమే మా లక్ష్యం అన్నారు. 12 జాతీయ, అంతర్జాతీయ మెడికల్ కంపెనీల ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఈ వర్క్ సెషన్స్ ను ఆధునిక ఆస్తమా చికిత్సలో ఉపయోగించే టెక్నాలజీలపై హ్యాండ్స్‌ఆన్ ట్రైనింగ్ అందించినట్లు ఆయన తెలిపారు.

## మురుగు సమస్యకు పరిష్కారం


**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** ఏండ్లుగా యూసుఫ్‌గూడ ప్రాంతంలో నెలకొన్న మురుగు సమస్యకు జలమండలి శాశ్వత పరిష్కారం చూపనుంది. వివిధ కారణాలతో మురుగు సమస్య తీవ్రరూపం దాల్చడంతో రోజుకు పదుల సంఖ్యలోనే జలమండలికి స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలోనే కృష్ణానగర్ మెయిన్ రోడ్డులో కృష్ణానగర్ వార్డు, బోరబండ సర్కిల్, ఖైరతాబాద్ జోన్ పరిధిలో 450 మిమీ డయా ఆర్సీసీ ఎన్‌పి4 సీవరేజ్ లైన్ నిర్మాణం చేపట్టింది. ఇదిలాఉండగా...అంచనా వ్యయం రూ.75 లక్షలతో ఈ పనులు జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ పోలీస్, విద్యుత్ శాఖ, టెలికమ్యూనికేషన్, హెచ్‌ఎంఆర్‌ఎల్ శాఖల సమన్వయంతో సమర్థవంతంగా కొనసాగుతున్నాయి.

## అవగాహనుంటే అగ్నిప్రమాదాలు అరికట్టవచ్చు

### ఫైర్ డిజి విక్రమ్‌సింగ్ మాన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అగ్ని భద్రత పరికరాల సరైన వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన అవసరమని తెలంగాణ అగ్నిమాపక శాఖ డిజి విక్రమ్ సింగ్ మాన్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాల సమయంలో సరైన చర్యలు తీసుకుంటే ప్రాణనష్టం, ఆస్తినష్టం గణనీయంగా తగ్గించవచ్చని ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధానిలో అగ్ని భద్రతపై అవగాహన పెంపు దిశగా తెలంగాణ అగ్నిమాపక శాఖ విభాగం కీలక కార్యక్రమం చేపట్టింది. సచివాలయంలో సోమవారం విక్రమ్‌సింగ్ మాన్ సమక్షంలో పూర్తి స్థాయి అగ్ని భద్రత మాక్ డ్రిల్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ మాక్ డ్రిల్‌లో ఫైర్ శాఖ సిబ్బంది పలు ఫైర్ టెండర్లు, ఆధునిక ఫైర్ ఫైటింగ్ రోబోట్‌తో పాటు ఇతర అగ్నిమాపక పరికరాలను వినియోగించి ప్రత్యక్ష ప్రదర్శనలు ఇచ్చారు. సచివాలయ సిబ్బందికి అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి మాక్ డ్రిల్స్ ద్వారా చిన్న అగ్ని ప్రమాదాల సమయంలోనే పౌరులు అప్రమత్తంగా వ్యవహరించి పెద్ద ప్రమాదాలను నివారించగలరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జి.వి. నారాయణరావు సహా విభాగానికి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సచివాలయం సిఎస్‌ఒ దేవీదాస్, ఎస్‌పిఎఫ్ బృందాలు, వివిధ శాఖల సిబ్బంది మాక్ డ్రిల్‌ను వీక్షించారు.



## ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక అమలు పరచాలి

### రైతు సంఘం డిమాండ్




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** వ్యవసాయ ప్రణాళికను శాస్త్రీయంగా ప్రభుత్వం అమలు జరపాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. భూభారతి చట్టాన్ని రైతులకు ప్రయోజనకరంగా సవరించి అమలు చేయాలని.. ప్రత్యామ్నాయ పంటల విధానం రూపొందించాలని కొత్తగూడెంలో ఏప్రిల్ 23, 24, 25 తేదీల్లో జరిగిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభలో ఆమోదించిన 32 తీర్మానాలను సుందరవిజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో రాష్ట్ర కమిటీ ప్రకటించింది. విలేకరుల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, కోశాధికారి మూడ్ శోభన్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, మత్స్య కార్మికుల సంఘం నేత లెల్లెల బాలకృష్ణ, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం నేత ఉడుత రవీందర్ మాట్లాడుతూ... ఏప్రిల్ 28 నుంచి మే 5 వరకు పంటల కొనుగోలు కేంద్రాల సందర్శన, ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్త ప్రచారం చేస్తామన్నారు. కౌలు రైతులకు 2011 చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామన్నారు. పాల రైతులకు పెండింగ్ బిల్లు చెల్లించాలని, లీటర్‌కు రూ.5 ఇన్సెంటివ్ ఇవ్వాలని అధికారులకు వినతి పత్రాల సమర్పణ తదితర కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. 26 జిల్లాల నుంచి 450 మంది ప్రతినిధులు రాష్ట్ర మహాసభలో పాల్గొన్నారని.. నూతన రాష్ట్ర కమిటీని, జిల్లాల కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన చట్టం రూపొందించి అమలు చేయాలని.. ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మాణాలను పూర్తి చేయాలని.. రుణమాఫీ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించాలని.. పంటల రుణ ప్రణాళిక అమలు చేయాలని... మొత్తం 32 తీర్మానాలను చేసినట్లు ఆయన వారు వివరించారువివరించారు.

## సత్వరమే సమస్యలకు పర్కిషారం

### కలెక్టర్ ప్రియాంక ఆల



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన వారి నుంచి ఆమె ఆర్జీలను స్వీకరించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. వాట్సాప్ ద్వారా వచ్చిన ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 471దరఖాస్తులు రాగా వాటిలో గృహనిర్మాణ శాఖకు చెందినవి 379,పింఛన్ల కోసం 46, రెవెన్యూశాఖకు సంబంధించినవి 22, ఇతర శాఖలకు చెందినవి 24 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదివరన్ పలని, జితేందర్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు




**ప్రజాపక్షం / సిటీ బ్యూరో:** వివిధ ప్రభుత్వ శాఖల వారీగా ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని హైదరాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక ఆల అధికారులకు సూచించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆమెను వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు కావాలని చెప్పారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అధికారులందరు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచాలని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అదనపు కలెక్టర్లు కదివరన్ పలని, జితేందర్ రెడ్డి, ఇంచార్జి డిఆర్‌ఓ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు , సిబ్బంది పాల్గొన్నారు.

## హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో హెచ్‌జెఎఫ్ ప్రదర్శన

**ప్రజాపక్షం /హిమాయత్‌నగర్:** హైటెక్‌సిటి జ్యువెలరీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (హెచ్‌జెఎంఎ) సహకారంతో 18వ ఎడిషన్ హైదరాబాద్ జ్యువెలరీ పెర్ల్ అండ్ జెమ్ ఫెయిర్ (హెచ్‌జెఎఫ్ 2026)ను మే 8 నుంచి 10 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ బి2బి జ్యువెలరీ సోర్సింగ్ షోగా గుర్తింపు పొందిన ఈ ప్రదర్శనలో ఈసారి సరికొత్త నాలెడ్జ్ ఆధారిత కార్యక్రమాలను, పరిశ్రమల మధ్య చర్చలను పెంపొందించేలా రూపొందించిన షోకేస్‌లను పరిచయం చేస్తున్నామన్నారు. ముంబైలోని ప్రసిద్ధ జవేరీ బజార్‌కు చెందిన ప్రముఖ తయారీదారులు ఈ ప్రదర్శనకు రానున్నట్లు తెలిపారు. ఆర్టిసన్ జోన్ ద్వారా కరీంనగర్‌కు చెందిన వెండి ఫిలిగ్రీ హస్తకళల అద్భుతమైన వారసత్వాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ షోలో ఎం శశి బదాలియా, ముక్తి గోల్డ్, అంజూ జ్యువెలర్స్, శ్రద్ధా జ్యువెలర్స్, మానేపల్లి జ్యువెలర్స్, అంబికా సిల్వర్ వంటి ప్రముఖ బ్రాండ్లతో పాటు మరెన్నో సంస్థలు పాల్గొంటున్నట్లు వివరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

### త్వరలో విడుదల కానున్న నోటిఫికేషన్
### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) త్వరలోనే అధికారిక షెడ్యూల్‌ను విడుదల చేయనుందని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడేందుకు చట్టప్రకారం ఎన్నికల సంఘం ప్రతి ఎన్నికకు ముందు లేదా అవసరాన్ని బట్టి సవరణలు చేపడుతుందన్నారు. ఓటర్లు తమ వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

సవరణ ఉద్దేశం 2002 ఎస్‌ఐఆర్‌తో అనుసంధానం ఓటర్ల జాబితాలో ఒకరి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం, వలసలు, మరణించిన వారి వివరాలు తొలగించకపోవడం వల్ల తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ఈ ప్రత్యేక సమగ్ర సవరణను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలను 2002లో జరిగిన చివరి ఎస్‌ఐఆర్ వివరాలతో లేదా వారి బంధువుల పేర్లతో సరిపోల్చే బాధ్యతను బిఎల్‌ఓలు, ఎఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలకు అప్పగించినట్లు చెప్పారు.

వివరాలు ఎలా తనిఖీ చేసుకోవాలి ?
ఓటర్లు తమ 2002 నాటి వివరాలను ఈ క్రింది మార్గాల ద్వారా తెలుసుకోవచ్చు..

**వెబ్‌సైట్ :** https://ceotelangana.nic.in **లేదా** https://voters.eci.gov.in **లోని** Search by Electordetails ద్వారా ఎంపిక చేసుకోవచ్చు.

**పిడిఎఫ్ జాబితా :** అధికారిక వెబ్‌సైట్‌లో పోలింగ్ స్టేషన్ వారీగా అందుబాటులో ఉన్న పిడిఎఫ్‌లను తనిఖీ చేసుకోవచ్చు.

**బిఎల్‌ఓ సహాయం :** ఆయా బూత్‌ల వద్ద ముద్రించిన 2002 ఓటర్ల జాబితా ప్రతులు అందుబాటులో ఉంటాయి.

ఒకవేళ ఓటరు పేరు 2002 జాబితాలో లేకపోతే, వారి తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేయాలని సూచించారు.




## జీబ్రా సిగ్నల్ ఏర్పాటుకు వినతి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి** :కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మయంసిన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక సమస్యలను సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ వివరించారు. మూసాపేట్ సర్కిల్ పరిధిలోని ఇంద్రానగర్, శ్రీశ్రీ నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో రహదారి దాటడం ప్రజలకు తీవ్ర ప్రమాదంగా మారిందని,. రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టి రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంద్రానగర్ ప్రధాన రహదారిపై జీబ్రా సిగ్నల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రశాంతినగర్ పరిశ్రమల ప్రాంతంలో పని చేస్తున్న వందలాది కార్మికులు రహదారి రాటడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ప్రమాదాలకు దారితీస్తోందని తెలిపారు. ఈ సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.మనోచారి, గంగన్న, దావీద్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలను పరిష్కరించండి..

### ప్రజావాణిలో సిపిఐ నాయకుడు సదానందం వినతి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్** : చింతల్ సర్కిల్‌లోని రోడమేస్త్రీ డివిజన్ పరిధిలోని లెనిన్‌నగర్ సీ బ్లాక్‌లో డ్రైనేజీ లైన్ పరిష్కారానికి, అలాగే హైమాస్ట్ లైట్ కావాలని కోరుతూ సోమవారం మున్సిపల్, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సిపిఐ నాయకుడు సదానందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేనిన్ నగర్ సి బ్లాక్‌లోని చౌరస్తా వద్ద వీధి దీపాలు లేకపోవడం వల్ల రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇదే విషయంపై గతంలో కూడా వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్థలాన్ని పరిశీలించి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్ట్రీట్ నంబర్ 7లో డ్రైనేజీ లైన్ పాతదై తరచూ పొంగిపొర్లుతుందని, కొత్త డ్రైనేజీ లైన్ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబ్, రాజు చిన్నారి, అనిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

**గిరినగర్ బస్తీలో బోర్ బావి మోటార్ మరమ్మతుకు వినతి**

283 గిరినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ బస్తీలో పోచమ్మగుడి ఎదురుగా ఉన్న విద్యుత్ బోర్ బావి సబ్‌మర్సిబుల్ మోటార్ గత కొంతకాలంగా పాడైపోయి ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయినట్లు స్థానికులు తెలిపారు. మోటార్‌ను మరమ్మతుల కోసం తీసుకెళ్లి చాలా రోజులైనా తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో ఈ ఎండాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, సబ్‌మర్సిబుల్ మోటార్‌ను మరమ్మతులు చేసి తిరిగి అమర్చి ప్రజలకు నీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజావాణిలో సోమవారం సిపిఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ కౌన్సిలర్ వి.చంద్రమ్మ, మాజీ కౌన్సిలర్ పి.నర్సయ్య, సిపిఐ శాఖ కార్యదర్శి ఎండి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హకీంపేటలోని ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు రాష్ట్ర జోన్1కి చెందిన ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కొమరం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల నుండి 54మంది బాలికలతో సహా 106 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారందరికి ప్రవేశాల ఎంపికల్లో భాగంగా వైద్యులచే ఆరోగ్య పరీక్షలతో పాటు వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటి, మెడిసిన్ బాల్ త్రో, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల రన్నింగ్ లాంటి శారీరక పరీక్షలు పారదర్శకంగా నిర్వహించారు. ఈ ప్రక్రియలో తెలంగాణా స్పోర్ట్స్ అథారిటి డిప్యూటి డైరెక్టర్ రవీందర్, స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్డీ మమతలు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ వెంకన్నను దర్శించుకున్న రాములుగౌడ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరం తాండాలోని శ్రీ బాలాజి వెంకటేశ్వరస్వామిని మూడుచింతలపల్లి సిపిఐ మున్సిపల్ కార్యదర్శి తప్పెట్ల రాములుగౌడ్ సోమవారం దర్శించుకున్నారు. శ్రీ బాలాజి వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా రెండవ రోజు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

# బాలల హక్కులు, చట్టాల పట్ల సమగ్ర అవగాహనకు ప్రచారం

### కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** బాలల హక్కులు, చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పించే లక్ష్యంగా జిల్లాలో గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కల్సి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, అక్రమ దత్తతలు, బాలలపై లైంగిక వేధింపులు, చట్టాల విషయంలో ప్రచారం చేస్తూ అవసరమైన సందర్భాల్లో 1098 ద్వారా సమాచారాన్ని చేరవేసి సాయం తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే విధంగా వాటి వల్ల జరిగే నష్టాలను వివరించాలన్నారు. జిల్లాలో 67 చైల్డ్ కేర్ సంస్థల్లో 1800 మంది పిల్లలు ఉన్నారని, వీరిలో అనాథ పిల్లలకు జనన, కుల, సదరన్ ధృవీకరణ పత్రాల జారీ, ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శారద, జిల్లా వైద్యారోగ్య, విద్యా, కార్మిక శాఖాధికారులు, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమలదేవి, సిడబ్ల్యూసి సభ్యుడు రాంమోహన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

**డీజిల్, పెట్రోల్ కొరత లేదు** : జిల్లాలో ఎలాంటి డీజిల్, పెట్రోల్ కొరత లేదని, ఈ విషయంలో వస్తున్న సోషల్ మీడియా దుష్ప్రచాలను చూసి వాహనదారులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎనర్జీ కమిటి సమావేశం నిర్వహించి ఇంధన సరఫరా అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ జిల్లాలోని అన్ని పెట్రోల్ పంపుల్లోనూ అవసరమైన మేరకు డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉన్నాయన్నారు. పెట్రోల్ పంపు యజమానులు ఎప్పటికప్పుడు తమకు అవసరమైన మేరకు డీజిల్, పెట్రోల్ స్టాక్‌ను ఆయిల్ సంస్థల నుండి తెప్పించుకోవాలని సూచించారు. జిల్లా ఎనర్జీ కమిటి సభ్యులు, డిసిఎస్ఓ, డిపిఆర్ఓ, ఆయిల్ సంస్థ ప్రతినిధులు, పెట్రోల్ పంపు అసోసియేషన్ సభ్యు లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**ప్రజావాణిలో 89 అర్జీలు**

కిందిస్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 89 అర్జీలను దఖాస్తుదారులు సమర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ చంద్రావతి, ఇతర జిల్లా స్థా యి ప్రభుత్వ కార్యాలయాధికారులతోకల్సి ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్ కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలను సైతం దరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

**విద్యార్థి సమస్యలపై బిఆర్ఎస్వీ దాఖలు చేసిన అర్జీ**

రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్వీ చేపట్టిన పోరుబాటలో భాగంగా తెలంగాణా రాష్ట్ర విద్యార్థి ప్రధాన కార్యదర్శి యశ్వంత్, జిల్లా కోఆర్డినేటర్ నర్సింగ్, కొర్ర ప్రవీణ్ నాయక్, రాజు యాదవ్, మనీషా, రవి కిరణ్ తదితరులు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు బకాయిలు సకాలంలో ప్రభు త్వం కాలేజీలకు చెల్లించక పోవటం వల్ల విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారని, రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించటంతో పాటు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



## పార్కు స్థలం కాపాడిన డిప్యూటీ కమిషనర్

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బోరంపేట సింహపురి కాలనీలోని పార్కు స్థలం కబ్జాల కు గురవడంతో ప్రజాపక్షం దినపత్రికలో పార్కు స్థలం కబ్జాపై చర్యలకు డిమాండ్ అనే వార్త కథనం రావడం తో అధికారులు పార్కును కాపాడారు సర్వే నంబర్. 448 డి.బ్లాక్ లోని 500 గజాల పార్కు స్థలం తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి సూచిక బోర్డులు తొలగించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో దుండిగల్ సర్కిల్ అధికారులు సోమవారం చర్యలకు శ్రీకారం చుట్టారు. దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఎన్.వెంకటేశ్వర్ నాయక్ ఆదేశానుసారంగా ఎసిపి శ్రీనివాసు ఆధ్వర్యం లో పార్కు స్థలంలోని నిర్మాణాలను జెసిబి సహాయంతో కూల్చివేతలు చేశారు. పార్క్, ప్రజా ప్రయోజన స్థలాలు కబ్జాలకు పాల్పడితే సహించబోమని అన్నారు. అదే విధంగా దుండిగల్ సర్కిల్ పరిధిలోనీ సింహపురి కాలనీ, మల్లంపేట్, కెవిఆర్ తదితర ప్రాంతాలలో ఇటీవలే కబ్జాలకు గురైన పార్కు స్థలాలను సైతం ఉన్నత అధికారులు కాపాడి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని ప్రజలు అంటున్నారు.



## పిల్లలను డ్రగ్స్‌కు దూరంగా ఉంచుదాం

**ప్రజాపక్షం/ఉప్పల్** : పిల్లల భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే వారిని మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచడం అత్యంత అవసరమని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తల్లిదండ్రులకు సూచించారు. డ్రగ్స్‌కు నో చెప్పి పిల్లల్ని కాపాడి, భవిష్యత్తు ను రక్షిద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం రామంతాపూర్‌లోని డాన్ బోస్కో నవజీవన్ కేంద్రంలో సే నో టు డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సంక్షేమ అధికారి శారద, ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ కీసర డివిజన్ సత్యవతి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం చేసిన ఇద్దరు అరెస్టు...రిమాండ్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఇటీవల నయీం అనుచరుడు పాశం శ్రీనివాస్‌పై హత్యయత్నం చేసిన ఇద్దరు నిందితులను కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాశం శ్రీనివాస్(53)పై గత మూడు రోజుల క్రితం రాధిక చౌరస్తా స్వాగత్ గ్రాండ్ హోటల్ లో హత్యయత్నం చేసేందుకు వచ్చి ప్రయత్నం విఫలం కావడంతో కత్తులను వదిలి పారిపోయారు.



ఆదివారం భువనగిరిలో ఖాజా తన డ్రైవర్ అజ్మద్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు,కారును స్వాధీనం చేసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చి రిమాండ్‌కు తరలించారని వారు తెలిపారు.



## మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తాం

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్ మున్సిపాలిటిలోని అన్ని వార్డుల్లో మౌళిక వసతులను కల్పిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటిలోని మజీద్‌పూర్‌లో 10,11 వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మజీద్‌పూర్‌లోని రెండు వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయుటకు మున్సిపల్ నిధులతో భూమిపూజ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్‌లు వనజ అశోక్‌రెడ్డి, సామల జశ్వంత్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, ఎఇ సనా, మాజీ సర్పంచ్ ఎళ్ల మల్లేష్, బిసి సెల్ అధ్యక్షుడు నర్సింగరావుగౌడ్, నాటకారి వెంకటయ్య, నాయకులు భాస్కర్ గౌడ్, జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ చక్రీ విద్యానికేతన్‌లో "మీట్ ద సైంటిస్ట్" కార్యక్రమం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చక్రీపురం శ్రీ చక్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో 'మీట్ ద సైంటిస్ట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ శాస్త్రవేత్త కర్రె మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలో శాస్త్రవేత్తల పాత్ర అత్యంత కీలకమైందని కొత్త విషయాలు కనుగొనడమే కాకుండా ఆవిష్కరణలు సమస్త మానవాళికి ఉపయోగకరంగా ఉందని అన్నారు. సైన్స్ పట్ల ఉన్న అపోహలను తొలగిస్తూ, పరిశోధన పట్ల విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు.ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కోశాధికారి పి. నాగరాజు, సీనియర్ నాయకులు శేషగిరిరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమిత్రల పోస్టులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సనత్‌నగర్‌లో ప్రారంభమయ్యే టిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ విధానంలో 34 ఆరోగ్యమిత్రల పోస్టుల భర్తీ చేసేందుకు ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరి పేర్కొన్నారు. డిగ్రీతో పాటు డిసిఏ పూర్తి చేసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావాసులైన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని, 2 ఏళ్ల అనుభవం కల్గి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://medchalmalkajgiri. telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ధరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని సంబంధించిన ధృవపత్రాలతో పాటు 500 రూపాయల డిడిని జతపరిచి జిల్లా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో గడువు తేదీలోగా ప్రతి రోజు ఉదయం 11 నుండి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని తెలిపారు.

## పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటా



**ప్రజాపక్షం/చర్లపల్లి:** పారిశ్రామిక ప్రగతి కోసం పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన వెక్టర్ ఇంజనీర్స్ ఎలక్ట్రికల్ వ స్తూ ప్రదర్శనను చర్లపల్లి ఐలా చైర్మన్ గోవిందరెడ్డి సిఐఎ అధ్యక్షు లు డి. శ్రీనివాస్‌రెడ్డిలతో కలసి ప్రారంభించారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఎలక్ట్రికల్ వస్తూ ప్రదర్శన ఏర్పా టు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఎలక్ట్రికల్ రంగలో 16 సం.గా సేవలు అందిస్తున్నామని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ కె హరీష్‌రెడ్డి, రోషిరెడ్డి, సంస్థ ప్రతినిధులు, తదితరు లు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన సదస్సులు

### కలెక్టర్ దీపక్ తివాక్




**ప్రజాపక్షం/వికారాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళికలలో భాగంగా ఈ నెల 27నుండి మే 2వరకు బాలల భద్రత, రక్షణ, డ్రగ్స్ రహిత సమాజంపై అనే కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయని జిల్లా కలెక్టర్ దిపక్ తివారి అన్నారు. ఈ కార్యక్రమాల అమలు పై సోమవారం కలెక్టర్ విడియో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో మాట్లాడారు. జిల్లాలో బాలల భద్రత డ్రగ్స్ రహిత సమాజపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నా రు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం గూర్చి పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 27నుండి మే 2వరకు నిర్వహించే సదస్సులలో బాలల భద్రత, రక్షణ, డ్రగ్స్ రహిత సమాజం అనే అశంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాల గురించి వివరించాలని సూచించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహించడం, డ్రగ్స్ అమ్మకాలను అరికట్టేందుకు ప్రభుత్వ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. బాలల భద్రత ఫోక్సో చట్టం, గుడ్ టచ్..బ్యాడ్ టచ్ సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రతలు, బాల్యవివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోని విద్యాసంస్థలలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఉపాధ్యాయులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, స్థానిక పోలీసు అధికారు లు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి రాము నాయక్, ట్రేని కలెక్టర్, సిపిఓ వెంకటేశ్వరులు, డిఆర్‌డిఎ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజాణికి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 145 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకు న్న వచ్చిన సమస్యల సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ప్రజావాణిపై నమ్మకంతో దరఖాస్తులు చేసుకుంటారని, అట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో జిల్లా స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# వాడవాడలా బిఆర్ఎస్ ఆవిష్కరణ వేడుకలు

**ప్రజాపక్షం/కాప్రా/మల్కాజిగిరి** : బిఆర్ఎస్ జెండా పండుగ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా వాడవాడలా పండుగలా కొనసాగింది. తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్య మ సంస్థగా ఆవిర్భవించిన బిఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని సాధించిన అనంతరం రూపాంతరం చెంది 26 వసంతాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధుల్లో బిఆర్ఎస్ శ్రేణులు ఆయా ప్రాంత కూడళ్లు, పార్టీ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధుల కార్యాలయాల వద్ద పార్టీ పతాకాలను ఆవిష్కరిం చి పటాకులు కాల్చటం, స్వీట్లు పంచిపెట్టుకోవటం ద్వారా సంబురాలు జరుపుకొన్నారు. జై తెలంగాణా, జై కెసిఆర్ నినాదాలలో హోరెత్తించారు.

**మల్లాపూర్‌లో...**ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్‌లో నిర్వహించిన జెండా స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పార్టీ పతాకాన్ని ఎగురవేసారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర సాధన అనంతరం పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణు లు శ్రీనివాస్ గౌడ్, కుంటి కృష్ణ, మల్లేష్, ఉస్మాన్, దయాకర్‌రెడ్డి, గణేష్, రాజేష్, రఘువరన్, కృష్ణగౌడ్, శ్రవణ్, రిజ్వాన్,తదితరులు పాల్గొన్నారు.

**మౌలాలిలో...** మౌలాలి ప్రధాన చౌరాస్తాలో మహ్మద్ ఉస్మాన్ ఆధ్వర్యంలో జరిగిన బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో పార్టీ సీనియర్ నేత బద్దం పరశురాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ మురుగేష్, తదితరులు పాల్గొన్నారు.

**జవహర్ నగర్‌లో:** ప్రజల గుండెల్లో చిరస్థాయిగా బీఆర్ఎస్ పార్టీనిలుస్తుందని, మాజీ సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ఖ్యాతిగాంచాయని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జవహర్ నగర్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండ ల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిర్భావ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.











